క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సమీపంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలతోపాటు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు సౌకర్యాలను ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈవో పి.సురేష్‌కుమార్‌రెడ్డి కల్పించారు.

డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన యశ్వంత్



జమ్మలమడుగు : జమ్మలమడుగు డీఎస్పీగా డాక్టర్ టీడీ యశ్వంత్ ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్‌ఐలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యాత్మక గ్రామాలు, ఫ్యాక్షన్ గ్రామాలు, రౌడీషీటర్లపై ఆరాతీశారు. పోలీసులు బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వహించాలని రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేవిధంగా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాసుందరి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒకప్పుడు కేన్సర్ బాగా ధనవంతులకే వచ్చేదనే నానుడి ఉండేదని, ఆ తర్వాత ఆ వ్యాధి మధ్యతరగతి వారికి కూడా రావడం మొదలైందని, కేన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫాతిమా కళాశాల హెచ్‌ఓడీ, రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాసుందరి తెలిపారు. ఆదివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్ పురుషులు, మహిళలకు అనే తేడా లేకుండా ప్రతి ఐదుగురిలో ఒకరు తమజీవిత కాలంలో ఎదుర్కొంటున్నారన్నారు. మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార కేన్సర్, రొమ్ము కేన్సర్ అధికంగా వస్తున్నాయన్నారు. పురుషుల్లో నోటి కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, అన్నవాహిక కేన్సర్ అధికంగా ఉన్నాయన్నారు. ఈ వ్యాధి వచ్చాక చికిత్స చేయించుకోవడం కంటే రాకుండా ముందుజాగ్రత్త చర్యలతోపాటు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీలో కేన్సర్‌ను చేర్చడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడడంతోపాటు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడుతున్నారన్నారు. పొగాకు, మద్యపానం మానేయాలని, పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు 4–5 లీటర్ల నీరు తీసుకోవడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయరామిరెడ్డి, డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉయ్యాలవాడ’ వర్ధంతి సభకు సన్నాహాలు

కడప సెవెన్‌రోడ్స్ : రేనాటి సూర్యుడు, ప్రథమ స్వాతంత్య్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి సభను ఈ నెల 22న కడపలో నిర్వహించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. మానవత సంస్థ నాయకుడు బైరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భావితరాలకు స్ఫూర్తినిచ్చేందుకు త్యాగానికి, దాతృత్వానికి ప్రతీకలైన నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి కాంస్య విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటు చేయాలని ఇదివరకే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లినా.. ఆశించిన స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. రైతు బజారు, ఐటీఐ సర్కిల్, కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో ఉన్న రాజీవ్‌మార్గ్ ప్రదేశాల్లో ఏదో ఒక చోట స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడి.. అధిక రాబడి

పాలు సేకరించే మండలాలు :	7
అందుబాటులో ఉన్న బీఎంసీలు :	4
పాలు సేకరించే మొత్తం గ్రామాలు :	162
కేంద్రానికి పాలు పోసే మహిళలు :	4500
రోజూ సేకరించే పాలు లీటర్లలో :	28,319



చక్రాయపేట బీఎంసీలో పాలు పోస్తున్న మహిళలు



మబ్బుచింతలపల్లె బీఎంసీలోకి పాలు పోసేందుకు వచ్చిన మహిళలు

- ప్రభుత్వ సహకారంతో పాడి పరిశ్రమకు పునర్ వైభవం
- పెరిగిన పాల ధరలతో రైతులకు గిట్టుబాటు

పులివెందుల : జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులలో ఆనందం వెల్లివిరుస్తోంది. పాల సేకరణ పెంపులో భాగంగా అమూల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాడి పరిశ్రమ పురోగమిస్తోంది. ఫలితంగా మహిళలు అధిక ఆదాయం ఆర్జిస్తూ కుటుంబాలకు దిక్సూచిలాగా నిలుస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో అమూల్ ఆధ్వర్యంలో నాడు 4 వేల లీటర్ల పాల సేకరణ ప్రారంభం కాగా.. ప్రస్తుతం 30 వేల లీటర్లకు చేరువలో ఉంది. ప్రభుత్వం పాడి పరిశ్రమకు ప్రోత్సాహం కల్పిస్తూ పశువుల కొనుగోలుకు రాయితీపై రుణాలు అందిస్తుండటంతోపాటు పాడి పోషణకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తుండటంతో ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ సహకారం :
అమూల్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ఉన్న ఊర్లోనే కళ్ల ముందే ఎటువంటి మోసాలకు తావు లేకుండా వెన్న శాతం లెక్కించి వారం రోజుల వ్యవధిలోనే పాడి రైతులకు బిల్లులు చెల్లించడంతో వారిలో భరోసా ఏర్పడింది. మరోవైపు ప్రైవేట్ డెయిరీల ఆగడాలను కట్టడి చేయడంతో పాడి రైతులకు ఆదాయం సమకూరుతోంది. గతంలో ప్రైవేట్ డెయిరీలు చెప్పిందే ధర.. ఇచ్చే డబ్బులే మహా భాగ్యం అన్నట్లు ఉండేది. నేడు ప్రైవేట్ డెయిరీలకు దీటుగా ప్రభుత్వం ముందుకొచ్చి పాల ధరలను పెంచుతూ పోవడంతో పాల ఉత్పత్తి గిరాకీగా మారి పాడి రైతులకు వరంగా మారింది. ప్రస్తుతం 10 శాతం వెన్నగల గేదె పాలు లీటరు రూ.79.79 అదే 5 శాతం వెన్నగల ఆవుపాలు లీటరు రూ.41.25లుగా ఉంది.

పాడి గేదేల కొనుగోలుకు రాయితీలు.. :
రైతులను ప్రోత్సహించే క్రమంలో భాగంగా పాడి గేదేల కొనుగోలుకు డీసీసీబీ, కెనరా బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులు సబ్సిడీపై రుణాలు ఇస్తున్నాయి. ఒక్కో గేదే కానీ, ఆవు కానీ కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.80వేల చొప్పున ఇస్తున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 7,486 మంది రైతులకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు డీఆర్‌డీఏ చేయూత అందించింది. దీంతో రైతులపై పెద్ద భారం పడకుండా ఉండటంతో ఎక్కువ మంది రైతులు గేదేలను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు.

పాల సేకరణ ఇలా.. :
నియోజకవర్గంలో పులివెందుల, చక్రాయపేట, వేంపల్లె, వేముల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు మండలాల పరిధిలోని 162 గ్రామాల్లో 4500 మంది రైతుల నుంచి ప్రతిరోజు 28 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. పులివెందుల, లింగాల, చక్రాయపేట, వేముల బీఎంసీలలో పాలను కూలింగ్ చేసి అక్కడ నుంచి ప్రధాన కేంద్రానికి రవాణా చేస్తున్నారు.

ఏటా రైతులకు బోనస్ :
ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా పాడి రైతులకు బోనస్ అందజేస్తారు. దీనికి అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు ఏడాదిలో 180 రోజులు పాలు పోసే రైతులందరికి ప్రతి లీటరుకు 50 పైసలు చొప్పున వారి ఖాతాలో జమ చేయనున్నారు. దీంతో ఎంతో మంది రైతులకు ప్రోత్సాహకంగా నిలిచింది.

ప్రైవేట్‌తో పోటీగా ధరలు



ప్రైవేట్ డెయిరీలతో పోటీగా ప్రభుత్వం ధరలను పెంచింది. దీంతో పాల ధరలు గిట్టుబాటు అవుతున్నాయి. గతంలో ఇంత ధరలు లేక గిట్టుబాటు అయ్యేవి కాదు. ప్రస్తుతం పాల సేకరణ చేసిన వారం రోజుల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారు. ఎలాంటి మోసాలు లేకుండా వెన్న శాతానికి అనుగుణంగా ధరలు నిర్ణయిస్తున్నారు. నేను రోజుకు 7 లీటర్ల పాలు కేంద్రానికి పోస్తున్నా.. గత ఏడాది బోనస్ కూడా ఇచ్చారు.
– గంగాదేవి(ఆర్.తుమ్మలపల్లె), పులివెందుల మండలం

అందరి సహకారంతో..



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిల సహకారంతో పనులన్నింటిని పూర్తి చేశాం. బీఎంసీల ఏర్పాటు చాలా వరకు అందుబాటులోకి వచ్చాయి. పాడి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర అందిస్తుండటంతో ఆ కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ఏటా బోనస్ ఇస్తూ రైతులను ప్రోత్సహించడం చాలా బాగుంది. దీంతో ఎక్కువ మంది రైతులు పాడి వైపు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.
– నీలకంఠారెడ్డి (ఏరియా కో ఆర్డినేటర్), పులివెందుల

గాయకులకు సత్కారం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన గాయకుల కృషిని గుర్తించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా వారిని సత్కరించారు. స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో మహమ్మద్ రఫీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక గాయకులు నయీమ్‌తోపాటు అస్గర్ హుసేన్, హుమయూన్‌బాషా, మహబూబ్‌బాషాలు మహమ్మద్ రఫీ ఆలపించిన సినీ గీతాలను పాడి అందరినీ అలరించారు. అనంతరం పలు సంవత్సరాలుగా స్థానిక గాయకులు చేస్తున్న కృషిని అభినందిస్తూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారిని శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

బలిజలు బలోపేతం కావాలి



నూతనంగా నియమితులైన సభ్యులతో నారాయణస్వామి రాయల్

కడప రూరల్ : బలిజ వర్గీయులు సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో బలోపేతం కావాలని కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు వీపీ నారాయణస్వామిరాయల్ అన్నారు. ఆదివారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ రాయలసీమలో బలిజ వర్గీయులు దాదాపు 36 లక్షల మంది ఉన్నారని, బలిజ కులస్తులందరూ చైతన్యవంతులై అన్ని రంగాల్లో పైకి ఎదగాలన్నారు. త్వరలో ఆరు జిల్లాల బలిజ సోదరులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ రాయలసీమ అధ్యక్షులుగా గాజులపల్లి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శిగా అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షులుగా ఎన్.సుబ్బనరసింహులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



కమలాపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీలు, కుల, మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ సాదిక్, మాజీ జడ్పీటీసీ మస్తానయ్య, మాజీ సర్పంచ్ దేవదానం ఆధ్వర్యంలో ఆదివారం 13వ వార్డులో ఇంటింటికి తిరిగి జగనన్నకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నా యన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. మీ కుటుంబానికి ప్రయోజనం కలిగి ఉంటేనే త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో గౌస్‌మున్నా, గౌస్ మోదీన్, షావలి, జిలానీ, జెట్టి నగేష్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేశాడు



పదవి విరమణ పొందిన ఎంఈఓ వీరారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు



జమ్మలమడుగలో పరమేశ్వరయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : పులివెందుల ఎంఈఓగా పని చేస్తూ పదవివిరమణ పొందిన ఎంఈఓ బండి వీరారెడ్డి అంకితభావంతో పనిచేసే గుణం ఉన్నవాడని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శిల్పారామం వద్ద ఉన్న సాయి బృందావన్ గార్డెన్‌లో ఎంఈఓ బండి వీరారెడ్డి పదవి విరమణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమన్నారు. తన వృత్తి పట్ల ఎంతో శ్రద్ధగా అంకితభావంతో పనిచేస్తారన్నారు. శేషజీవితం ఎంతో ఆనందంగా ఆరోగ్యంగా సాగాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు, అధికారులు ఆయనను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం శాలువలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్‌రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిషోర్, కౌన్సిలర్ కోడిరమణ, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సీకే వెంకటనాథరెడ్డి, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..
జమ్మలమడుగు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంఈఓగా పదవీ విరమణ చేసిన పరమేశ్వరయ్యను ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం పరమేశ్వరయ్య మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి ప్రధానోపాధ్యాయుడిగా, విద్యాశాఖాధికారిగా విధులను నిర్వహించడంలో సఫలీకృతమైనట్లు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా దక్కిందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు శివజ్యోతి, చౌడయ్య, చిట్టిబాబు, వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు గురుకుమార్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు, జరినాబేగం, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను హత్యచేసిన హంతకులను శిక్షించాలి

కడప సెవెన్‌రోడ్స్ : విశాఖపట్టణం గ్రామీణ తహసీల్దార్ రమణయ్యను కిరాతకంగా చంపిన హంతకులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ తహసీల్దార్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బీఏ వేదనాయకం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తాము చెప్పిన పనులు చేయలేదని కక్షతో అధికారులను చంపడం అనాగరికం ఆయన పేర్కొన్నారు. గతంలో తెలంగాణ జిల్లాలో కూడా ఓ మహిళా తహసీల్దార్‌ను పెట్రోలు పోసి తగులబెట్టిన సంఘటన తీవ్ర కలకలం రేపిందని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద తగు పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులపై వరద కపట ప్రేమ

ప్రొద్దుటూరు : రైతులపై మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని రాయలసీమ పోలీసు కంప్లెంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాయలసీమకు గత టీడీపీ ప్రభుత్వంలో తీరని అన్యాయం జరిగినా, ఆనాడు ఆయన ఒక్క మాట మాట్లాడలేదని పేర్కొన్నారు. రైతు వేషం వేసిన వరదరాజులరెడ్డి రాజుపాళెం మండలం వెల్లాలో రైతు సదస్సు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణాజలాల్లో రాయలసీమకు నికర జలాల విషయంలో టీడీపీ తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఇటీవల కృష్ణా జలాల గురించి స్పష్టత ఇవ్వలేదని, పోలవరం, పట్టిసీమతోనే రాయలసీమకు మేలు జరుగుతుందని నమ్మబలికారని పేర్కొన్నారు. వరదరాజులరెడ్డి రైతుల కోసం అంటూ పెట్టిన సదస్సు వెనుక రాజకీయ ప్రయోజనాలు తప్ప రైతులకు ఆయన చేసే మేలు ఏమైనా ఉందా? ఇప్పటిదాకా చేసింది ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం



మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది ప్రతి మహిళ లక్ష్యాధికారి కావాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి అన్నారు. ఆదివారం నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి పొదుపు సంఘాల మహిళలు యానిమెటర్లు, హాజరయ్యారు. మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆయన పాదయాత్రలో చెప్పిన విధంగా నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేశాడన్నారు. 230 సంఘాలకు రూ. కోట్టి 97 లక్షల రుణాలు మహిళల అకౌంట్లో జమచేశారన్నారు.
రాబోవు ఎన్నికల్లో మళ్లీ వై ఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చెయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి మహిళలకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధివాకర్, ఎంపీపీ వరలక్ష్మి, ఏరియా కోర్డి నేటర్ నీలకంఠారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అజ్జుగట్టు భాస్కరరెడ్డి, పుష్పనాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, రామమల్లేశ్వరరెడ్డి, డిష్ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, డీఆర్‌పీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం జగనన్న



పుష్పగిరిలో నిర్వహించిన ప్రచారంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : రాష్ట్ర ప్రజల ఆర్థిక స్వావలంబన కోసం చిత్త శుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను ఆరా తీశారు. అన్ని వర్గాల ప్రజలకు కుల మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. పథకాలన్నీ కొనసాగాలంటే జగన్ తిరిగి సీఎం కావాల్సిన అవసరం వుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

చెన్నూరు : పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే గ్రామంలో ఉండే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రామనపల్లెలో ఆదివారం ఇంటింటికి వెళ్లి పరిసరాలపై, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా మాట్లాడుతూ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా ఆదివారం నాలుగవ రోజు మండలంలోని రామనపల్లెలో హెల్త్ అవేర్నెస్ ర్యాలీని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని మాస్కులను, ఐరన్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.విజయలక్ష్మిదేవి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వివిధ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, ఆహార నియమాల గురించి గ్రామీణ ప్రజలకు వివరించారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలోకి చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాష్ట్ర అభివృద్ధితోపాటు సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే ఒక్క జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్ రెడ్డి అన్నారు. అదివారం పట్టణంలోని 3వ వార్డు సున్నపుబట్టీలు వీధి, వినాయకనగర్‌లలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. అలాగే వారి సమస్యలను తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల సమక్షంలో పరిష్కరించారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా ముందుటానని ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, 3వ వార్డు కౌన్సిలర్ భాస్కర్, పార్టీ నాయకులు వర్రా డెవిడ్, సలీమ్, ఓబుళరెడ్డి రఘురాముడు, సురేష్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సాయం:
పట్టణంలోని 13వ వార్డులో ఉన్న వైఎస్సార్ కార్యకర్త ఆర్‌ఎస్ ఖాదర్‌వలి ఆనారోగ్యంతో బాధపడుతుంటే వైద్య ఖర్చులకు కోసం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో పలు కుటుంబాలు చేరిక..
13వ వార్డులోని 35 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఆ వార్డు ఇన్‌చార్జి మహమ్మద్‌గౌస్ అధ్వర్యంలో చేరారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 3వ వార్డులో కూడా పలు కుటుంబాలు పార్టీలో చేరారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

కడప కార్పొరేషన్ : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా తెలిపారు. ఆదివారం స్థానిక ఉప ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.7.25 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు చేయడం అద్భుతమని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదప్రజలకు ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాధవరాయ స్వామి విజయోత్సవం

మైదుకూరు : మైదుకూరులో వెలిసిన శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి పార్వేట అనంతరం ఆదివారం విజయోత్సవాన్ని నిర్వహించారు. జనవరి 14న ప్రారంభమైన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మైదుకూరు పరిసరాల్లో ఉన్న 16 గ్రామాల్లో శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి పార్వేట ఉత్సవాలను నిర్వహించారు. ఆదివారం మైదుకూరుకు చేరుకున్న శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామికి విజయోత్సవం పేరుతో ప్రత్యేక అలంకరణ చేసి రథంపై గ్రామోత్సవం నిర్వహించారు.

మహిళా సమస్యల పరిష్కారానికి చట్టాలు

కడప కల్చరల్ : మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పలు చట్టాలను రూపొందించిందని, వాటిపై అవగాహన కలిగి ఉండి స్వీయ రక్షణతోపాటు సాటి మహిళల రక్షణ కోసం కృషి చేయాలని ప్రముఖ సైకాలజిస్టు పీవీ సునీత అన్నారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో మహిళా సాధికారత–రక్షణ–అవగాహనపై ఆమె మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలు, మహిళా భక్షులు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, వాటి ద్వారా మహిళా సమస్యల పరిష్కారంపై వివరించారు. ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ గురించి కూడా సోదాహరణంగా వివరించారు. ప్రధాని మోడీ మహిళల కోసం తెచ్చిన చట్టాలపై తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మునగా శ్రీనివాస్, యాదాళ్ల రమణ, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షులు వంకదారి విజయ, కోశాధికారి వంకదారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.